# యువ వెలుగు

PRGI: TGTEL/26/A6429

E- Paper, www.yuvavelugu.com

తెలుగు దిన పత్రిక

సంపుటి : 01 సంచిక : 35 | ప్రచురణ : రంగారెడ్డి | ఎడిటర్ : పి. మహేష్ గౌడ్ | గురువారం 08-10-2026 | పేజీలు : 4 ధర :- 02/-


హైదరాబాద్‌లో జాతీయ తైక్వాండో ఛాంపియన్‌షిప్ ముగింపు




- వివరాలు 2లో


యువ వెలుగు తెలుగు దిన పత్రికలో పని చేయుటకు

రిపోర్టర్లు కావలెను

PRESS

మండలం । నియోజకవర్గం । జిల్లా వారీగా రిపోర్టర్లు కావలెను

9908 502 602


## తెలంగాణలో పెరిగిన విద్యుత్ డిమాండ్

2లో

## యువత నైపుణ్యమే తెలంగాణకు బలం

ప్రపంచ సంస్థలకు హైదరాబాద్ గమ్యస్థానం

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

2లో

## ఈశాన్య ఢిల్లీలో కుప్పకూలిన 5 అంతస్థుల భవనం

# 'రోడ్ డస్ట్' నియంత్రణకు ప్రత్యేక దృష్టి



- సమన్వయంతో స్వచ్ఛ వాయు లక్ష్య సాధనకు టిజిపిసిబి కృషి
- కాలుష్య మూలాల నిర్మూలనే లక్ష్యంగా విస్తృత కార్యక్రమాలు
- వాయు నాణ్యత పర్యవేక్షణ వ్యవస్థ మరింత బలోపేతం
- ప్రజా రవాణాలో ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం పెంపు
- స్వచ్ఛ వాయు సర్వేక్షణలో తెలంగాణకు గుర్తింపు
- టిజిపిసిబి మెంబర్ సెక్రటరీ రవి వెల్లడి
- వాయు నాణ్యత మెరుగుదలకు శాస్త్రీయ పర్యవేక్షణ, సమగ్ర కార్యాచరణ
- కాలుష్య మూలాల నియంత్రణకు ప్రభావవంతమైన చర్యలు
- కాలుష్య మూలాల నియంత్రణపై సెక్రటేరియట్‌లో సమావేశం

**హైదరాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 7 :** తెలంగాణలో వాయు కాలుష్య నియంత్రణ, వాయు నాణ్యత మెరుగుదల కోసం ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ కమిటీ(ఎక్యుఎంసి) ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు సత్ఫలితాలనిస్తున్నాయని అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్ అన్నారు. శాస్త్రీయ పర్యవేక్షణ, కాలుష్య మూలాల గుర్తింపు, నియంత్రణ చర్యలు, పచ్చదనం పెంపు, ప్రజా అవగాహన కార్యక్రమాలతో కూడిన సమగ్ర కార్యాచరణను కొనసాగిస్తుండటం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ రోజు సెక్రటేరియట్‌లో కమిటి ఛైర్మన్, ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్ ఆధ్వర్యంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ రవి కమిటి మెంబర్ కన్వీనర్‌గా నిర్వహించిన ఎయిర్ క్వాలిటి మానిటరింగ్ కమిటి సమావేశం కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సిపిసిబి) ఆమోదించిన ఎక్యుఎంసి కార్యాచరణ ప్రణాళికలోని అంశాల పై చర్చించింది. సీనియర్ ఎన్విరాన్మెంటల్ సైంటిస్ట్, చీజూగా నోడల్ ఆఫీసర్ ప్రసాద్, జీహెచ్ఎంసి, సైబరాబాద్ మల్కాజ్గిరి కార్పొరేషన్ల కమిషనర్లు, నల్గొండ కలెక్టర్, సిడిఎంఎ అధికారులు, ట్రాన్స్పోర్ట్ కమిషనర్, టిజిఎస్ ఆర్ టిసి, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్గిరి ట్రాఫిక్ కమిషనరేట్ల అధికారులు, టిజి ఐఐసి, వ్యవసాయ, పౌర సరఫరాల శాఖ అధికారులు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, అమలు చేసిన కార్యక్రమాల పై చర్చించిన తర్వాత ఎయిర్ ⏭ తరువాయి 2లో..

## ఆర్బీఐ నిర్ణయంతో స్టాక్ మార్కెట్ కుదేలు

**న్యూఢిల్లీ :** దేశీయ స్టాక్ మార్కెట్లకు బుధవారం భారీ షాక్ తగిలింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి 5.5 శాతానికి చేర్చడంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ దెబ్బతింది. దీంతో వరుసగా రెండు రోజుల లాభాలకు బ్రేక్ పడింది. సెన్సెక్స్ 429.11 పాయింట్లు నష్టపోయి 72,638.70 వద్ద ముగిసింది. నిఫ్టీ 173.05 పాయింట్లు కోల్పోయి 22,603.05 వద్ద స్థిరపడింది. ఆర్బీఐ వడ్డీ రేట్లను పెంచడంతో పాటు తన ద్రవ్య విధాన వైఖరిని 'క్యాలిబ్రేటెడ్ టైటనింగ్'గా మార్చింది. దీంతో రానున్న రోజుల్లో వడ్డీ రేట్ల పరిస్థితి మరింత కఠినంగా ఉండొచ్చన్న ఆందోళన ఇన్వెస్టర్లలో పెరిగింది.

## పండగ రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు

### దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం



**న్యూఢిల్లీ :** రాబోయే పండుగల సీజన్ దృష్ట్యా ప్రయాణికుల అదనపు రద్దీని నివారించడానికి దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. బెంగళూరు కంట్ - బీదర్, యశ్వంత్‌పూర్ - సహర్స మార్గాల్లో పండుగ ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్లు అధికారిక ప్రకటనలో తెలిపింది.

# త్వరలో బీజేపీలో కీలక పదవి అంటూ ప్రచారం

## బండి సంజయ్ నోట ఆసక్తికర మాటలు!

- బీజేపీ తనకు ఎన్నో అవకాశాలు
- ఇచ్చిందన్న కేంద్ర మంత్రి ఏ బాధ్యత అప్పగించినా శిరసావహిస్తానని వ్యాఖ్య
- పదవుల కోసం పాకులాడే వ్యక్తి కాదని వెల్లడి
- కేసీఆర్ భూ వివాదాలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి డ్రామాలని విమర్శ




**హైదరాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 7 :** కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కు త్వరలో తెలంగాణ బీజేపీలో కీలక బాధ్యతలు అప్పగించనున్నారనే ప్రచారం జరుగుతున్న వేళ ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీ తనకు ఎన్నో పదవులు, అవకాశాలు ఇచ్చిందని చెప్పారు. తాను పదవుల కోసం పాకులాడే వ్యక్తిని కాదన్నారు. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా శిరసావహిస్తానని, కార్యకర్తగా పార్టీ కోసం పనిచేస్తానని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను పురస్కరించుకుని బీజేపీ కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో 'సేవా జ్యోతి' ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన బండి సంజయ్.. కేసీఆర్ భూ వివాదాలపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పడం అంతా డ్రామాలేనని విమర్శించారు. బీఆర్ఎస్ అవినీతిపై చర్యలు తీసుకునే దమ్ము కాంగ్రెస్‌కు లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలపై పోరాడే సత్తా బీఆర్ఎస్‌కు లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందాలు ఉన్నాయని ఆరోపించారు. ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ సహా విపక్షాలు చేస్తున్న విమర్శలపై బండి ⏭ తరువాయి 2లో..

# ఈజీ మనీ ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- హెచ్చరించిన తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో
- సైబర్ మోసాలు చేస్తున్న 101 మంది అరెస్ట్



**హైదరాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 7 :** ఒక్క బ్యాంక్ అకౌంట్ ఇస్తే డబ్బులు వస్తాయి.. కమీషన్ తీసుకోండి.. ఈజీ మనీ! సోషల్ మీడియా, మెసేజింగ్ యాప్స్‌లో ఇలాంటి మెసేజ్‌లు చూసి చాలామంది పెద్దగా పట్టించుకోరు. కానీ ఇలాంటి చిన్న ఆఫర్లే చివరకు భారీ సైబర్ క్రైమ్ నెట్‌వర్క్‌లో భాగం చేసే ప్రమాదం ఉంది. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో నిర్వహించిన భారీ మల్టీ-స్టేట్ ఆపరేషన్ ఇప్పుడు ఇదే విషయాన్ని బయటపెట్టింది. ఆరు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఏకకాలంలో జరిగిన ఈ ఆపరేషన్‌లో 18 మంది మహిళలు సహా 101 మంది నిందితులు అరెస్టయ్యారు. వీరి ద్వారా సుమారు 17 కోట్ల మోసపూరిత లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. సెప్టెంబర్ 23 నుంచి రెండు వారాల పాటు కేరళ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, పుదుచ్చేరిలో ఈ ఆపరేషన్ కొనసాగింది. అసలు ఈ నెట్‌వర్క్‌లో ముఖ్యమైన పాత్ర పోషించింది మ్యూల్ బ్యాంక్ అకౌంట్స్. అంటే.. సైబర్ మోసగాళ్లు తమ పేర్లపై కాకుండా ఇతరుల బ్యాంక్ ఖాతాలను డబ్బులు స్వీకరించడానికి, ట్రాన్స్‌ఫర్ చేయడానికి ఉపయోగించుకోవడం. ఇందుకోసం కొందరు ఏజెంట్లు కమీషన్ తీసుకుని బ్యాంక్ ఖాతాలను సైబర్ నేరగాళ్లకు ⏭ తరువాయి 2లో..




## దసరాకు 7,000 ప్రత్యేక బస్సులు

### 30 మంది ఉంటే ఇంటికే వచ్చి పికప్: టీజీఎస్ఆర్టీసీ

- రాష్ట్రంలోని వివిధ జోన్ల నుంచి వేల సంఖ్యలో సర్వీసుల ఏర్పాటు
- ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సవరించిన టికెట్ ధరలు అమలు
- అక్టోబర్ 9, 10, 16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండే అవకాశం

2లో

# సిర్పూర్-కాగజ్‌నగర్ రైలులో మంటలు..

# తప్పిన ముప్పు

- సిర్పూర్-కాగజ్‌నగర్ రైలులో స్వల్ప అగ్నిప్రమాదం
- యాదాద్రి జిల్లా బీబీనగర్ సమీపంలో ఘటన
- బ్రేక్ లైనర్, చక్రం రాపిడితో చెలరేగిన మంటలు
- ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదని వెల్లడి
- మరమ్మతుల తర్వాత రైలు తిరిగి ప్రయాణం



**యాదాద్రి, యువ వెలుగు, అక్టోబర్ 7 :** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ సమీపంలో బుధవారం ఉదయం సిర్పూర్-కాగజ్‌నగర్ వెళుతున్న రైలులో స్వల్ప అగ్నిప్రమాదం ⏭ తరువాయి 2లో..

# హైదరాబాద్‌లో 30 మంది ముస్లిం ఓటర్ల తొలగింపు యత్నం : బీజేపీ ఏజెంట్‌పై కేసు

- ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఘటన
- ఒకేసారి 30 ఓట్ల తొలగింపునకు కుట్ర చేసినట్టు ఆరోపణ
- 30 మంది ఓట్లను తొలగించాలంటూ సెప్టెంబర్ 28న ఫారం-7 దరఖాస్తుల సమర్పణ



**హైదరాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 7 :** హైదరాబాద్‌లో ఓటర్ల జాబితా నుంచి 30 మంది ముస్లింల పేర్లను అక్రమంగా తొలగించేందుకు ప్రయత్నించారనే ఆరోపణలపై బీజేపీ బూత్ లెవల్ ఏజెంట్‌పై కేసు నమోదైంది. ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో చోటుచేసుకున్న ఈ ఘటన రాజకీయంగా కలకలం రేపుతోంది. వివరాల్లోకి వెళితే, ముషీరాబాద్ నియోజకవర్గంలోని సూర్య నగర్ పోలింగ్ స్టేషన్ నెం. 210 పరిధిలో ఎస్. బాలచందర్ అనే బీజేపీ బూత్ ఏజెంట్, 30 మంది ఓటర్ల పేర్లను తొలగించాలని కోరుతూ సెప్టెంబర్ 28న ఫారం-7 దరఖాస్తులను సమర్పించారు. బాధితులంతా ముస్లిం వర్గానికి చెందినవారే. అధికారులు వాటిని మూకుమ్మడిగా స్వీకరించేందుకు నిరాకరించడంతో, అతను ఆ పత్రాలను అక్కడే వదిలివెళ్లినట్లు తెలుస్తోంది.

ఈ ఘటనపై ముషీరాబాద్ నియోజకవర్గ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్ఓ) టి. ప్రవీణ్ కుమార్ చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో ఎన్నికల అధికారులు జరిపిన విచారణలో ఆ 30 మంది ఓటర్లు వారి చిరునామాల్లోనే నివసిస్తున్నట్లు నిర్ధారణ అయింది. దీంతో, దురుద్దేశంతోనే ⏭ తరువాయి 2లో..

# త్వరలో బీజేపీలో కీలక పదవి అంటూ ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

సంజయ్ తీవ్రంగా స్పందించారు. 'ఓట్ చోరీ, సీట్ చోరీ' పేటెంట్ కాంగ్రెస్‌కే ఉందని ఆరోపించారు. 1946లో కాంగ్రెస్ పీసీసీలన్నీ సర్దార్ పటేల్ ప్రధాని కావాలని ప్రతిపాదించినా.. నెహ్రూను ప్రధాని చేశారని విమర్శించారు. దేశంలో బోగస్ ఓట్లు ఉన్నాయని కాంగ్రెస్సే చెప్పిందని, ఇప్పుడు వాటిని తొలగిస్తుంటే ఎందుకు అభ్యంతరం చెబుతోందని ప్రశ్నించారు. ప్రధాని మోదీకి ఓటు, సీటు చోరీ చేయాల్సిన అవసరం లేదన్నారు. కుటుంబం, బినామీ ఆస్తులు, వారసత్వ రాజకీయాలు ఆయనకుఅవసరం లేదని చెప్పారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ సహా కొన్ని పార్టీలు చెప్పే మాటలు నమ్మి యువత మోసపోవద్దని బండి సంజయ్ సూచించారు. 2014కు ముందు, ఇప్పటి భారత్‌ను పోల్చి చూడాలని కోరారు. ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధ సంస్థ అని, అది బీజేపీ జేబు సంస్థ కాదన్నారు. రాజ్యాంగ సంస్థను బదనాం చేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని హెచ్చరించారు.

# హైదరాబాద్‌లో జాతీయ తైక్వాండో ఛాంపియన్‌షిప్ ముగింపు



### 13 ప్రాంతాల నుంచి సుమారు 350 మంది క్రీడాకారుల పోటీ

### అండర్-14లో మహారాష్ట్ర, అండర్-17లో కర్ణాటక-గోవా, అండర్-19లో ఉత్తరప్రదేశ్ విజేతలు

**హైదరాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 7 :** హైదరాబాద్ షేక్‌పేట్‌లోని ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించిన 7వ సిస్కే జాతీయ తైక్వాండో టోర్నమెంట్ ఫర్ బాయ్స్-2026 బుధ వారం ముగిసింది. నాలుగు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో 13 ప్రాంతాలకు చెందిన సుమారు 350 మంది యువ క్రీడాకారులు పాల్గొన్నారు. సిస్కే నేషనల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్-2026, ఏపీ-తెలంగాణ రీజియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఛాంపియన్‌షిప్‌లో అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాల్లో వివిధ బరువు కేటగిరీల్లో కియోరూగి పోటీలు జరిగాయి. ముగింపు కార్యక్రమానికి సిస్కే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్-హైదరాబాద్ డిప్యూటీ సెక్రటరీ డాక్టర్ గాడ్విన్ డేనియల్ అథిష్టమ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇంటర్నేషనల్ స్కూల్, షేక్‌పేట్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ కకర్ల సుశ్రుత్ తదితరులు పాల్గొన్నారు. విజేతలకు స్వర్ణ, రజత, కాంస్య పతకాలు, ధ్రువపత్రాలను అందజేశారు. అండర్-14లో మహా రాష్ట్ర, అండర్-17లో కర్ణాటక-గోవా, అండర్-19లో ఉత్తరప్రదేశ్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీలను కైవసం చేసుకున్నాయి.పోటీల నిర్వహణకు అవసరమైన సౌకర్యాలు కల్పించిన ఆతిథ్య పాఠశాలను డాక్టర్ అథిష్టమ్ అభినందించారు. క్రీడాకారులు, కోచ్‌లు, తల్లిదండ్రుల ఉత్సాహాన్ని ప్రశంసించారు. తైక్వాండో క్రీడ యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సంయమనం, క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. ఈ ఛాంపియన్‌షిప్ ద్వారా క్రీడాకారులకు జాతీయ స్థాయి పోటీల్లో అనుభవం లభించింది. అగ్రస్థానాల్లో నిలిచిన క్రీడాకారులను నిర్దేశిత ఎంపిక ప్రక్రియకు లోబడి రానున్న SGFI నేషనల్ స్కూల్ గేమ్స్‌లో సిస్కే తరఫున ప్రాతినిధ్యం వహిం చేందుకు పరిశీలించనున్నారు.

# విద్యార్థులకు రూ.20,000 విలువగల స్కూల్ బ్యాగులు పంపిణీ



**జనగామ జిల్లా, యువ వెలుగు, అక్టోబర్ 7 :** దేవరుప్పుల మండలం, అప్పిరెడ్డి పల్లి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు జీ.శంకర్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ దేవరుప్పుల వారి సహకారంతో ఐ.వా రెడ్డి రైస్ మిల్ యజమాని దుగ్గింపూడి కిరణ్ కుమార్ రెడ్డి పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు సుమారు 20,000 విలువైన బ్యాగులను పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ దేవరుప్పుల అధ్యక్షుడు,బ్యాగుల దాత కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నైతిక విలువలు కలిగిన నాణ్యమైన విద్య లభిస్తుందని,కావున విద్యార్థులు క్రమశిక్షణతో ఇష్టంగా చదువుకుని పాఠశాలకు, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని తెలియజేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు లయన్స్ క్లబ్ దేవరుప్పుల ప్రతినిధులకు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీమతి కౌడగాని అనూష నరసింగరావు,లయన్స్ క్లబ్ దేవరుప్పుల అధ్యక్షుడు గోలి చిన్న ఉప్పల్ రెడ్డి,కార్యదర్శి బూత్కూరి అశోక్ రెడ్డి, ట్రస్ట్ చైర్మన్ మర్రి పట్టాభిరాం రెడ్డి, ట్రెజరర్ ఈదునూరి రామచంద్రారెడ్డి,ఉపాధ్యక్షులు దుగ్గింపూడి కిరణ్ కుమార్ రెడ్డి,ఉపాధ్యాయులు నవీన్ కుమార్ ,తిరుపతి రెడ్డి, అంగన్వాడీ టీచర్స్,విద్యార్థులు పాల్గొన్నారు.

# పోరాటం ఆగదన్న రేవంత్ రెడ్డి

# తనను అడ్డుకున్న ఢిల్లీ పోలీసులపై అసహనం

- ఢిల్లీలో రాహుల్ గాంధీని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఘటనను తీవ్రంగా ఖండించిన సీఎం రేవంత్ రెడ్డి
- రాహుల్‌ను కలిసేందుకు యత్నించిన రేవంత్‌ను అడ్డుకున్న పోలీసులు
- ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్
- ఈసీని అడ్డుపెట్టుకుని ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారని ఆరోపణ



**హైదరాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 7 :** ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా ఇతర విపక్ష నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ చర్యలను అప్రజాస్వామికమని ఆయన మండిపడ్డారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేసే వరకు తమ పోరాటం ఆగదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. బుధవారం ఢిల్లీలో నిర్వహించిన నిరసన ప్రదర్శనలో రాహుల్ గాంధీని నిర్బంధించిన అనంతరం, ఆయనను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్‌తో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అయితే, వారిని పోలీసులు లోపలికి వెళ్లకుండా అడ్డుకోవడంతో పోలీసుల తీరుపై రేవంత్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపే ప్రాథమిక హక్కును కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. ఎన్నికల కమిషన్ (ఈసీ) ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీ, మైనారిటీ వర్గాల ఓటు హక్కును లక్ష్యంగా చేసుకుని వివక్షా పూరితంగా వ్యవహరిస్తోందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. "గతంలో ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకుని ఎన్నికల్లో లబ్ధి పొందిన వారు, ఇప్పుడు ఏకంగా ఎన్నికల కమిషన్‌నే పావుగా వాడుకుంటున్నారు" అని ఆయన ధ్వజమెత్తారు. అక్రమ అరెస్టులు, పోలీసుల నిర్బంధాలకు విపక్షాలు భయపడవని రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, పౌరుల ఓటు హక్కును కాపాడేందుకు రాహుల్ గాంధీ నాయకత్వంలో తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఆయన పునరుద్ఘాటించారు.

# తెలంగాణలో పెరిగిన విద్యుత్ డిమాండ్

- చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరువ
- 19,892 మెగావాట్లకు చేరిన డిమాండ్
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి



**హైదరాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 7 :** తెలంగాణలో విద్యుత్ డిమాండ్ చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరుకుంది. రాష్ట్రంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరినట్లు ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. దాదాపు 20 వేల మెగావాట్లకు చేరువైన డిమాండ్ ఉన్నప్పటికీ.. రాష్ట్రంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించామని చెప్పారు. ప్రజా భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. తెలంగాణలో విద్యుత్ డిమాండ్ పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే గణనీయంగా పెరిగిందన్నారు. కర్ణాటకలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 15 వేల మెగావాట్లలోపే ఉండగా.. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 13 వేల మెగావాట్లుగా ఉందని తెలిపారు. ఈ రాష్ట్రాల కంటే తెలంగాణలో విద్యుత్ వినియోగ డిమాండ్ ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్ నమోదైనప్పటికీ.. వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంలో కీలకపాత్ర పోషించిన విద్యుత్ సంస్థల సిబ్బందిని భట్టి విక్రమార్క అభినందించారు.

# ఈశాన్య ఢిల్లీలో కుప్పకూలిన 5 అంతస్థుల భవనం

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఈశాన్య ఢిల్లీలోని సీమాపురి ప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం ఓ ఐదు అంతస్తుల భవనం పేకమేడలా కుప్పకూలింది. కళ్లముందే భారీ భవనం నేలమట్టం కావడంతో ఆ ప్రాంతంలో తీవ్ర భయాందోళనలు, హాహాకారాలు చెలరేగాయి. భారీ ఎత్తున శబ్దం రావడంతో స్థానికులు భయంతో ఇళ్ల నుంచి రోడ్లపైకి పరుగులు తీశారు. బుధవారం మధ్యాహ్నం సుమారు 3:15 గంటల సమయంలో భవనం కూలిపోయినట్లు ఫైర్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందింది. సమాచారం అందిన వెంటనే ఢిల్లీ అగ్నిమాపక సిబ్బంది, స్థానిక పోలీసులు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నాయి. శిథిలాల తొలగింపు చర్యలను వేగవంతం చేశాయి. జిల్లా డీసీపీ ఆర్తి బీనా స్వయంగా ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి సహాయక చర్యల్లో పాలుపంచుకున్నారు. శిథిలాల కింద చిక్కుకున్న ఇద్దరు చిన్నారులతో సహా మొత్తం నలుగురిని బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన వారిని వెంటనే సమీపంలోని రాజీవ్ గాంధీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. అయితే భవన యజమానితో పాటు ఒకే కుటుంబానికి చెందిన సుమారు ఆరుగురు వ్యక్తులు ఇంకా శిథిలాల కిందే చిక్కుకుని ఉన్నట్లు తెలుస్తోంది. శిథిలాల కింద ఊపిరాడక అల్లాడుతున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు రెస్క్యూ సిబ్బంది శ్రమిస్తున్నారు. ప్రమాదానికి గురైన భవనం కేవలం 25 చదరపు గజాల విస్తీర్ణంలోనే నిర్మించినట్లు ప్రాథమిక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

# యువత నైపుణ్యమే తెలంగాణకు బలం

### ప్రపంచ సంస్థలకు హైదరాబాద్ గమ్యస్థానం

### ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**హైదారాబాద్, యువ వెలుగు :** తెలంగాణకు ఉన్న అతిపెద్ద బలం యువతలోని నైపుణ్యం, ప్రతిభ, ప్రపంచ స్థాయి పోటీతత్వమేనని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఈ ప్రతిభ కారణంగానే హైదరాబాద్ సాంకేతిక, ఆవిష్కరణ, ఆర్థిక సేవలు, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు (జీసీసీ) దేశంలోనే ప్రముఖ గమ్యస్థానంగా ఎదుగుతోందని వెల్లడించారు. జూబ్లీహిల్స్‌లో బుధవారం నాడు జరిగిన డిఇ షా షా ఇండియా 30వ వార్షికోత్సవ వేడుకల్లో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్‌లో డీఈ షా మూడు దశాబ్దాల ప్రస్థానం నగరంపై, తెలంగాణలోని ప్రతిభావంతులైన మానవ వనరులపై ఆ సంస్థకు ఉన్న దీర్ఘకాలిక విశ్వాసానికి నిదర్శనమని అన్నారు.

# ఈజీ మనీ ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

సమకూర్చినట్లు దర్యాప్తులో తేలింది. అరెస్టయిన 101 మందిలో 19 మంది ఏజెంట్లు, 81 మంది మ్యూల్ అకౌంట్ హోల్డర్లు ఉన్నారు. అంటే నా అకౌంట్ మాత్రమే కదా.. నేను ఏం చేశాను? అనే నిర్లక్ష్యం ఎంత ప్రమాదకరమో ఈ కేసు చెబుతోంది. అంతేకాదు.. ఈ నిందితుల బ్యాక్‌గ్రౌండ్ చూస్తే సైబర్ క్రైమ్ అంటే కేవలం చదువు లేని వాళ్లు లేదా నిరుద్యోగులే చేస్తారనే అపోహ కూడా తప్పని అర్థమవుతోంది. అరెస్టయిన వారిలో వ్యాపారులు, ప్రైవేట్ ఉద్యోగులు, గృహిణులు, డ్రైవర్లు, సేల్స్-మార్కెటింగ్ ఉద్యోగులు ఉన్నారు. ఒక టాటా క్యాపిటల్ ఉద్యోగి కమీషన్ కోసం సైబర్ మోసగాళ్లకు మ్యూల్ అకౌంట్లు సమకూర్చినట్లు ఆరోపణలు ఎదుర్కొంటుండగా, ఒక ఫ్లిప్‌కార్ట్ ఉద్యోగి తన బ్యాంక్ అకౌంట్‌ను మోసపూరిత లావాదేవీలకు ఉపయోగించేందుకు ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. మరో నిందితుడికి దేశవ్యాప్తంగా 50 సైబర్ క్రైమ్ కేసులతో సంబంధాలు ఉన్నట్లు తేలింది. ఇంకొకరికి 60 కేసులతో సంబంధం ఉన్నట్లు గుర్తించారు. మొత్తం 101 మందిలో 50 మందికి దేశవ్యాప్తంగా ఐదుకు పైగా నేర సంబంధాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. దర్యాప్తులో మరో షాకింగ్ విషయం కూడా బయటపడింది. మ్యూల్ అకౌంట్ల ద్వారా వచ్చిన డబ్బును ఏటీఎంల నుంచి విత్‌డ్రా చేయడం, ఇతర ఖాతాలకు బల్క్ ట్రాన్స్‌ఫర్లు చేయడం, విదేశీ లావాదేవీలకు ఉపయోగించడం వంటి మార్గాల్లో తరలించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ పనికి అకౌంట్ హోల్డర్లు, మధ్యవర్తులకు మోసపూరిత మొత్తంలో 5 శాతం వరకు కమీషన్ ఇచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అంటే సోషల్ మీడియాలో కనిపించే 'అకౌంట్ ఇవ్వండి.. కమీషన్ తీసుకోండి' అనే ఈజీ మనీ ఆఫర్ వెనుక ఎంత పెద్ద నెట్‌వర్క్ ఉండొచ్చో ఊహించుకోవచ్చు. ఈ ఆపరేషన్‌లో ఏడు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లలో నమోదైన 51 కేసులకు సంబంధించి అరెస్టులు జరిగాయి. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 1,172 నేర సంబంధాలు గుర్తించగా, అందులో 206 తెలంగాణకు సంబంధించినవిగా గుర్తించారు. ఇక యువత ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సిన విషయం ఏంటంటే.. ఓటీపీ, సిమ్, కేవైసి వివరాలు, సోషల్ మీడియా ప్రొఫైల్ కూడా నేరగాళ్లకు ఆయుధాలుగా మారొచ్చు. పార్ట్‌టైమ్ జాబ్, ఇన్‌స్టంట్ ఇన్‌కమ్, ట్రేడింగ్ ప్రాఫిట్, క్రిప్టో రిటర్న్స్, టాస్క్ కంప్లీట్ చేసి డబ్బు సంపాదించండి అంటూ వచ్చే ప్రతి ఆఫర్ నిజం కాదు. ముఖ్యంగా డిజిటల్ అరెస్ట్ పేరుతో పోలీసులు, కస్టమ్స్, కొరియర్ అధికారులు అంటూ వీడియో కాల్స్ చేసి డబ్బులు అడిగితే వెంటనే అప్రమత్తం కావాలి. ఎవరైనా మీ అకౌంట్‌ను ఉపయోగించుకోవడానికి కమీషన్ ఆఫర్ చేసినా.. ఒక్కసారి మాత్రమే అని చెప్పినా.. ఒప్పుకోకండి. ఎందుకంటే మీ అకౌంట్‌లో జరిగిన ట్రాన్సాక్షన్‌కు మీరు కూడా సమాధానం చెప్పాల్సి రావచ్చు. తెలియని లింకులపై క్లిక్ చేయకండి, ఓటీపీలు లేదా బ్యాంకింగ్ వివరాలు ఎవరికీ చెప్పకండి, సోషల్ మీడియాలో వచ్చిన అకౌంట్లకు డబ్బులు పంపకండి. ఏదైనా సైబర్ మోసం జరిగితే ఆలస్యం చేయకుండా 1930కు కాల్ చేయండి ఫిర్యాదు చేయండి. ఈ ఆపరేషన్ చెప్పే అసలు మెసేజ్ ఒక్కటే.. ఈజీ మనీ అనిపించే ప్రతి ఆఫర్.. ఈజీ మనీ కాకపోవచ్చు. ఒక్క బ్యాంక్ అకౌంట్ ఇవ్వడం కూడా మీ జీవితాన్ని సైబర్ క్రైమ్ కేసులోకి లాగొచ్చు.

# తప్పిన ముప్పు

(మొదటి పేజీ తరువాయి)

చోటుచేసుకుంది. ఈ ఘటనతో ప్రయాణికులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. అయితే, రైల్వే సిబ్బంది అప్రమత్తతతో వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే, రైలు బీబీనగర్ స్టేషన్ సమీపానికి చేరుకుంటున్న క్రమంలో, ఒక బోగీ చక్రానికి బ్రేక్ లైనర్‌లు పట్టేయడంతో ఏర్పడిన రాపిడి వల్ల పొగలు, మంటలు చెలరేగాయి. దీనిని వెంటనే గమనించిన కో-పైలట్, లోకో పైలట్‌ను అప్రమత్తంచేయడంతో రైలును బీబీనగర్ రైల్వే స్టేషన్‌లో నిలిపివేశారు. సమాచారం అందుకున్న రైల్వే సిబ్బంది, అగ్నిమాపక దళం హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ప్రయాణికులెవరికీ ఎటువంటి గాయాలు కాలేదని అధికారులు స్పష్టం చేశారు. అనంతరం సాంకేతిక సిబ్బంది అవసరమైన మరమ్మతులు పూర్తి చేయడంతో రైలు తిరిగి సిర్పూర్-కాగజ్‌నగర్‌కు బయలుదేరింది. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

# దసరాకు 7,000 ప్రత్యేక బస్సులు

**హైదారాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 7 :** దసరా పండుగను పురస్కరించుకుని ప్రయాణికులు తమ స్వగ్రామాలకు సురక్షితంగా, సౌకర్యవంతంగా చేరుకునేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) భారీ ఏర్పాట్లు చేసింది. పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7,000 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు బుధవారం ప్రకటించింది. సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం, కరీంనగర్ జోన్ పరిధిలో అత్యధికంగా 3,533 బస్సులు (ఆదిలాబాద్ 431, నిజామాబాద్ 719, కరీంనగర్ 1,175, వరంగల్ 530, ఖమ్మం 678) నడపనున్నారు. హైదరాబాద్ జోన్ నుంచి 2,155 బస్సులు (మహబూబ్‌నగర్ 645, మెదక్ 255, నల్గొండ 815, రంగారెడ్డి 440), గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి 1,312 ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయి. అక్టోబర్ 9, 10, 16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటుందని అంచనా వేస్తుండగా, తిరుగు ప్రయాణాల కోసం అక్టోబర్ 25, 26 తేదీల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది ప్రయాణికుల సౌకర్యార్థం టీజీఎస్‌ఆర్టీసీ ఒక నూతన సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కాలనీలు, టౌన్‌షిప్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, హాస్టళ్లు, కళాశాలల నుంచి కనీసం 30 మంది ప్రయాణికులు ఒక బృందంగా ఏర్పడి ముందస్తుగా బుక్ చేసుకుంటే, వారి వద్దకే బస్సును పంపి పికప్ చేసుకునే వెసులుబాటు కల్పించింది. ఈ ప్రత్యేక బస్సు సర్వీసులకు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం టికెట్ ధరలను సవరించినట్లు టీజీఎస్‌ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.

# 'రోడ్ డస్ట్' నియంత్రణకు ప్రత్యేక దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

క్వాలిటి మానిటరింగ్ కమిటి ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు, ఫలితాలను సమావేశం విశ్లేషించింది. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ కింద ఎక్యుఎంసి చేపడుతున్న కార్యక్రమాలను సీనియర్ ఎన్విరాన్మెంటల్ సైంటిస్ట్ ప్రసాద్ కమిటి ఛైర్మన్ అహ్మద్ నదీమ్, టిజిపిసిబి మెంబర్ సెక్రటరీ, కమిటి మెంబర్ కన్వీనర్ రవి, కమిటి సభ్యులకు వివరించారు. వాయు నాణ్యతను మరింత ఖచ్చితంగా, నిరంతరంగా పర్యవేక్షిం చేందుకు 13 'నిరంతర పరిసర వాయు నాణ్యత పర్యవేక్షణ వ్యవస్థల ఏర్పాటు ప్రక్రియ కొనసాగు తున్నది. పర్యవేక్షణ కేంద్రాల స్థానాలను శాస్త్రీయంగా నిర్ణయించి, ఆయా ప్రాంతాల్లోని వాయు నాణ్యతకు సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని పొందేలా సాంకేతిక కమిటీని ఏర్పాటు చేశారు. డేటాను సమగ్రంగా అందుబాటులోకి తీసుకురావడానికి "ఎయిర్ క్వాలిటి డ్యాష్ బోర్డు" అభివృద్ధి ప్రక్రియ కూడా కొనసాగుతున్నది. సంబంధిత శాఖలకు అలర్ట్‌ల ద్వారా వాయు నాణ్యతకు సంబంధించిన సమాచారం చేరవేస్తారు. అదేవిధంగా తక్కువ వ్యయంతో వాయు నాణ్యతను పర్యవేక్షించే 'లో కాస్ట్ సెన్సార్ల వినియోగాన్ని కూడా విస్తరిస్తున్నారు. టిజిపిసిబి ఆధ్వర్యంలో బొల్లారం, జీడిమెట్ల ప్రాంతాల్లో ఇప్పటికే 8 ఎల్సిఎస్ లను ఏర్పాటు చేశారు. రీసైక్లింగ్, క్రషింగ్ తదితర కార్యకలాపాలు జరిగే ప్రాంతాల్లో, అలాగే నిర్మాణ, కూల్చివేత ప్రదేశాల్లో ఎల్సిఎస్ ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.పట్టణ వాయు కాలుష్యంలో ధూళికణాల కాలుష్యాన్ని నియంత్రించేం దుకు రోడ్ డస్ట్ నియంత్రణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. రోడ్ల మెరుగుదల, ఎండ్-టు-ఎండ్ పేవింగ్, మెకానికల్ రోడ్ స్వీపింగ్, బహిరంగ ప్రాంతాల్లో పచ్చదనం పెంపుదల, ట్రాఫిక్ కారిడార్లలో గ్రీన్ కవర్, మినీ ఫారెస్టులు, మియావాకీ ప్లాంటేషన్లు వంటి చర్యలను నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (చీజూా) కింద చేపడుతున్నారు. మెకానికల్ రోడ్ స్వీపింగ్‌పై టిజిపిసిబి నిర్వహించిన అధ్యయన ఫలితాలను మూడు పట్టణ స్థానిక సంస్థల అధికారులకు వివరించేందుకు వర్క్ షాప్ నిర్వహించగా, సుమారు 100 మంది అధికారులు పాల్గొన్నారు. అధ్యయన సిఫారసులను రాబోయే సర్వీస్ ప్రొక్యూర్‌మెంట్ ప్రక్రియలో పరిగణనలోకి తీసుకోనున్నారు. వాహనాల ఉద్గారాలను తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం, ఈవీ ఛార్జింగ్ మౌలిక వసతుల విస్తరణ, పీయూసి వ్యవస్థ బలోపేతం వంటి చర్యలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ వాహనాల కొనుగోలు, అద్దెకు తీసుకునే వాహనాల్లో ఈవీ లకు ప్రాధాన్యత కల్పించే చర్యలు అమలయ్యాయి. పీయూసి వ్యవస్థను మరింత సమర్థవంతం చేసేందుకు రాష్ట్రంలోని 516 పీయూసి కేంద్రాలను కేంద్ర సర్వర్‌తో అనుసంధానం చేశారు. ఇప్పటివరకు 36,14,208 పరీక్షలు నిర్వహించినట్లు రవాణా శాఖ నివేదించింది. పీయూసి గడువు ముగిసిన వాహనాలపై ఆటోమేటిక్ చలాన్ల విధానం అమలు చేసేందుకు వాహనాల నంబర్ ప్లేట్లను స్వయంచాలకంగా గుర్తించే కెమెరాల ఏర్పాటుకు కూడా చర్యలు చేపడుతున్నారు. హైదరాబాద్‌లో ప్రజా రవాణా రంగంలో ఎలక్ట్రిక్ బస్సుల వినియోగాన్ని పెంచే చర్యలు కొనసాగుతున్నాయి.

# హైదరాబాద్‌లో 30 మంది ముస్లిం ఓటర్ల తొలగింపు యత్నం : బీజేపీ ఏజెంట్‌పై కేసు

(మొదటి పేజీ తరువాయి)

బాలచందర్ ఈ చర్యకు పాల్పడ్డారని ఈఆర్ఓ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు బాలచందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఈ ఘటనపై కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు తీవ్రంగా స్పందించాయి. దీని వెనుక పెద్ద కుట్ర ఉందని, దీనిపై సిట్ విచారణ జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. మరోవైపు, ఈ ఆరోపణలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఖండించారు. తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఫారం-7 దుర్వినియోగంపై నమోదైన తొలి ఎఫ్ఐఆర్ ఇదే కావడం గమనార్హం.

# వీరాపురం ర్యాంపుతో టీ. కొత్తగూడెం విలవిల



**పంచాయతీకి ఆర్థిక నష్టం గ్రామానికి దుమ్ము, ధ్వంసమైన రోడ్లు**

**బోర్లు పనిచేయక.. వ్యవసాయానికి తీవ్ర ఇబ్బందులు**

**సర్పంచ్ కనితి సుమలత, ఉప సర్పంచ్ రాయల నరసమ్మ ఆవేదన**

**పినపాక, యువ వెలుగు, అక్టోబర్ 07 :** వీరాపురం ర్యాంపు కారణంగా టీ. కొత్తగూడెం గ్రామపంచాయతీ తీవ్రంగా నష్టపోతోందని సర్పంచ్ కనితి సుమలత, ఉప సర్పంచ్ రాయల నరసమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ర్యాంపు కార్యకలాపాల ప్రభావంతో గ్రామంలో దుమ్ము పెరిగిపోవడంతో వ్యవసాయానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. భారీ వాహనాల రాకపోకలతో గ్రామంలోని రహదారులు దెబ్బతింటున్నాయని, తరచూ మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వారు పేర్కొన్నారు. ర్యాంపు ప్రభావంతో గ్రామంలోని బోర్లు సరిగా పనిచేయడం లేదని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఒకవైపు గ్రామపంచాయతీ ఆర్థికంగా నష్టపోతుండగా, మరోవైపు దుమ్ము, రోడ్ల ధ్వంసం, బోర్ల సమస్యలతో గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్, ఉప సర్పంచ్ పేర్కొన్నారు. వీరాపురం ర్యాంపు వల్ల గ్రామానికి కలుగుతున్న నష్టాలపై అధికారులు సమగ్రంగా పరిశీలించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

**టీ కొత్తగూడెం గ్రామస్తులకు పట్టాలు కట్టే అవకాశం కల్పించాలి**

**-సర్పంచ్ కనితి సుమలత డిమాండ్**



వీరాపురం ర్యాంపు కారణంగా టీ. కొత్త గూడెం గ్రామపంచాయతీకి, గ్రామస్తులకు కలుగుతున్న ఇబ్బందులకు నష్టపరిహారంగా మూడు రోజుల పాటు టీ. కొత్త గూడెం గ్రామస్తులకు లారీలపై పట్టాలు కట్టే అవకాశం కల్పించాలని గ్రామ సర్పంచ్ కనితి సుమలత డిమాండ్ చేశారు. గతంలో లాగా ఉమ్మడిగా పట్టాలు కట్టామని ఇప్పుడు కూడా అలానే అవకాశం కల్పించాలని కోరారు. ర్యాంపు కార్యకలాపాల కారణంగా గ్రామంలో దుమ్ము, రోడ్ల ధ్వంసం, బోర్ల సమస్యలు, వ్యవసాయానికి ఇబ్బందులు వంటి సమస్యలు ఎదురవుతున్నాయని ఆమె తెలిపారు. వీటితో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ర్యాంపు నిర్వాహకులు, సంబంధిత అధికారులు గ్రామ ప్రజల సమస్యలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. గ్రామానికి నష్టపరిహారం అందించే చర్యల్లో భాగంగా మూడు రోజుల పాటు టీ. కొత్తగూడెం గ్రామస్తులకు లారీలపై పట్టాలు కట్టే అవకాశం కల్పించాలని సర్పంచ్ డిమాండ్ చేశారు. ఈ విషయంపై అధికారులు, ర్యాంపు నిర్వాహకులు సానుకూలంగా స్పందించి గ్రామస్తులకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

# పరిశుభ్రత పాటించాలి - జిల్లా కలెక్టర్

**మిర్యాలగూడ, యువ వెలుగు, అక్టోబర్ 07 :** ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, పరిసరాల్లో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.మంగళవారం ఆయన వేములపల్లి మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసి ఓపీ వివరాలు,రోగుల రిజిస్ట్రేషన్, డెంగ్యూ, పాము కాటు కేసులు, సిబ్బంది హాజరు, మందుల నిల్వలు,డ్రగ్స్ రిజిస్టర్ తదితరాలను పరిశీలించారు.ఆసుపత్రిలో ఎదురవుతున్న సమస్యలు, నమోదవుతున్న కేసుల వివరాలను వైద్యాధికారినితో అడిగి తెలుసుకున్నారు.ప్రస్తుతం జలుబు, దగ్గు తదితర సీజనల్ వ్యాధుల కేసులు ఎక్కువగా వస్తున్నట్లు వైద్యాధికారి కలెక్టర్‌కు వివరించారు.ఆశా కార్యకర్తలతో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని, ప్రతి ఆశా కార్యకర్త డైరీలో ప్రజల ఆరోగ్య సమస్యలు,గర్భిణులు, ముఖ్యమైన వివరాలను నమోదు చేసుకోవాలని ,గర్భిణులను అవసరమైన సమయంలో ఏరియా ఆసుపత్రికి తరలించేలా ముందస్తుగా అవగాహన కల్పించాలని ఆదేశించారు.డెంగ్యూ వ్యాధి





వ్యాప్తికి అవకాశం లేకుండా గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, దోమల నివారణకు పారిశుధ్య చర్యలు చేపట్టాలని ,గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకుని ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని వైద్యాధికారిని ఆదేశించారు.

ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున నీటిని పొదుపుగా వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ అన్నారు.నీటిని వృథా చేయకుండా అవసరమైన మేరకు వినియోగించేలా ప్రజలను చైతన్యపరచాలని తెలిపారు. అదేవిధంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై ప్రజలకు, అర్హులైన బాలికలకు అవగాహన కల్పించి వ్యాక్సిన్ వేయించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పీహెచ్‌సీలోని అన్ని రిజిస్టర్లను, సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు గుర్తిస్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.కలెక్టర్ వెంట తహసిల్దార్ హేమలత, ఇంచార్జ్ ఎంపీడీవో జ్యోతి, హాస్పిటల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ జి. సుచరిత, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎన్. ప్రవీణ్, సూపర్వైజర్ శాంతమ్మ, రికార్డ్ అసిస్టెంట్ బి. సోములు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ఉన్నారు.

# మద్దికుంటలో తాగునీటి 'మంటలు'.. ఖాళీ బిందెలతో మహిళల కదం తొక్కుడు!

**ఆరో వార్డులో గుక్కెడు నీటికి తీవ్ర కటకట**

**పాలకవర్గం, అధికారుల నిర్లక్ష్యంపై భగ్గుమన్న జనం**

**'గ్రామంలో అసలు పాలన ఉందా? సర్పంచ్ బతికున్నారా?' అంటూ ఆగ్రహావేశాలు**

**శాశ్వత పరిష్కారం చూపకపోతే మండల కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరిక**



**రామారెడ్డి, యువ వెలుగు, అక్టోబర్ 07 :** పాలకుల ప్రగల్భాలు పల్లెల్లోకి చేరడం లేదు.. అభివృద్ధి నినాదాలు దాహం కేకల ముందు దిగదుడుపైపోతున్నాయి. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండల పరిధిలోని మద్దికుంట గ్రామంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. ప్రత్యేకించి గ్రామంలోని 6వ వార్డు పరిస్థితి మరింత దయనీయంగా మారింది. గుక్కె డు నీటి కోసం రోజుల తరబడి పడిగాపులుకాయాల్సి రావడంతో విసిగివేసారిన కాలనీ మహిళలు రోడ్డెక్కా రు. మంగళవారం ఖాళీ బిందెలతో ఆలవ వార్డ్ లో బైఠాయించి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. స్థానిక పాలకవర్గం, ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్య వైఖరిపై కన్నెర్రజేశారు. అసలు పాలన ఉందా? నిద్రపోతున్నారా? ఆరో వార్డులో గత కొద్ది రోజులుగా తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయినా సంబంధిత యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరి స్తోందని మహిళలు మండిపడ్డారు. నిరసన సందర్భంగా మహిళలు అధికారుల తీరును తీవ్రస్థాయిలో నిలదీశారు."మా గ్రామంలో అస లు పంచాయతీ పాలకవర్గం పనిచేస్తోందా లేక నిద్రపోతోందా? గ్రామ ప్రజల కు కనీస అవసరమైన మంచినీరు అందించలేని సర్పంచ్, పాలకులు ఉండి ఏం ప్రయోజనం? గ్రామంలో మనుషులు ఉంటున్నారా లేదా అన్న సోయి అధికారులకు లేదా?" అంటూ ఆక్రోశం వెళ్లగక్కారు. పనులన్నీ మానుకుని బిందెలు పట్టుకుని కాలనీలన్నీ తిరిగి నా చుక్క నీరు దొరకని దుస్థితి నెలకొందని వాపో యారు. ప్రైవేటు నీళ్ల కొనుగోళ్లతో జేబులకు చిల్లు ప్రభుత్వం ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ నీరు అంది స్తున్నామని గొప్పలు చెబుతున్నా,క్షేత్ర స్థాయిలో ఆరో వార్డు ప్రజలకు ఆ ఫలాలు అందడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. బోర్లు ఎండిపో వడం, పైపులైన్ మరమ్మతులపై పంచాయతీ సిబ్బంది శ్రద్ధ చూపకపోవడంతో సమస్య మరింత జటిలమైంది. గత్యంతరం లేక కూలీనాలి చేసుకునే పేద ప్రజలు ప్రైవేటు వాటర్ ప్లాంట్లు, నుంచి అధిక ధరలు చెల్లించి నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సంపాదించే కూలీ మొత్తం నీళ్లకే ఖర్చు చేయాల్సి వస్తే బతికేది లా అని మహిళలు ప్రశ్నించారు.అధికారుల దిష్టిబొమ్మల ఊరేగింపు నకు సిద్ధం - హెచ్చరికలు..పలు మార్లు వార్డు సభ్యులకు,గ్రామ పంచా యతీ అధికా రులకు మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదని, చేతకాని పాలనతోనే ఈ పరిస్థితి దాపు రించిందని కాలనీవాసులు ఆగ్ర హం వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి 6వ వార్డులో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోతే ఆందో ళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఖాళీ బిందెలతో మండల పరిషత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని, పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగుతామని తేల్చిచెప్పారు. ఈ నిరసన కార్యక్రమంలో 6వ వార్డు మహిళలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తైక్వాండో పోటీల్లో గ్రీన్ గ్రోవ్ విద్యార్థుల ప్రతిభ

**చిట్యాల, యువ వెలుగు, అక్టోబర్ 07 :** నల్గొండ జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 5వ యునైటెడ్ నల్గొండ డిస్ట్రిక్ట్ క్యూరుగీ అండ్ పూమ్సే ఛాంపియన్‌షిప్ పోటీల్లో చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని గ్రీన్ గ్రోవ్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. జిల్లా స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు వివిధ విభాగాల్లో పతకాలు సాధించి ప్రతిభ కనబరిచారు.అండర్-14 బాలుర విభాగంలో ఏడో తరగతి విద్యార్థి రాధారపు ప్రణయ్ మణిదీప్ గోల్డ్ మెడల్ సాధించగా, బొక్క శ్రీ విష్ణువర్ధన్, ఇల్లందుల విఘ్నేష్ సిల్వర్ మెడల్స్ బొక్క హర్షవర్ధన్ రెడ్డి బ్రాంజ్ మెడల్ సాధించారు.అండర్-14 బాలికల



విభాగంలో నాలం లోచన అనన్య, జిట్ట మిథిలా సిల్వర్ మెడల్స్ సాధించగా,బత్తుల వేదాన్ షిత బ్రాంజ్ మెడల్ సాధించింది. పతకాలు సాధించిన విద్యార్థులకు చిట్యాల సబ్-ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి, పాఠశాల డైరెక్టర్ జూలకంటి వేణుగోపాల్ రెడ్డి పతకాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. ముఖ్యంగా చిన్నతనం నుంచే తైక్వాండో వంటి ఆత్మరక్షణ విద్యలను నేర్చుకోవడం ఎంతో అవసరమని అన్నారు. ఆత్మరక్షణ నైపుణ్యాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు ఆపద సమయం లో తమను తాము కాపాడుకునే సామర్థ్యాన్ని కల్పిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు క్రీడలను కేవలం పోటీల్లో పతకాలు సాధించేందుకు మాత్రమే కాకుండా, శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, ఏకాగ్రత,ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకునేందు కు ఉపయోగించుకోవాలని ఎస్సై సూచించారు. గ్రీన్ గ్రోవ్ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ జాన్ రెడ్డి, తైక్వాండో మాస్టర్ పట్టేడ సుధాకర్, వ్యాయామ ఉపాధ్యాయుడు గంగాపురం రాము పాల్గొన్నారు.

# పాఠశాల బస్సుల తనిఖీ



**ఎల్లారెడ్డి పేట, యువ వెలుగు, అక్టోబర్ 07 :** ఒక పాఠశాల బస్సులో అధిక విద్యార్థులతో ప్రయాణిస్తున్న వీడియో సోషల్ మీడియాలో చెక్కర్లు కొట్టినసందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా రవాణాశాఖ అధికారి దేవునూరి శ్రీనివాస్ ఆదేశాల మేరకు మోటార్ వాహనంలో తనిఖీ అధికారి వంశీధర్ మంగళ,బుధవారం జిల్లాలోని వివిధ మండలాలకు సంబందించిన పాఠశాలల బస్సులను ఆపి విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి విద్యార్థులు అధికంగా ఉన్న పాఠశాల బస్సు యాజమాన్యానికి నోటీసులు జారిచేసినామన్నారు. ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలాలకు సంబందించిన,విద్యార్థులు అధికంగా ఉన్న రెండు బడి బస్సులకు ఫైన్ వేసినామని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు బడి బస్సులో తమ పిల్లలకు సీటు ఉంటేనే పిల్లల్ని అనుమతించాలని తెలియజేశారు. ఇట్టి వాహన తనిఖీల్లో మోటారు తనిఖీ అధికారి వంశీధర్ కానిస్టేబుల్ రమ్య హోంగార్డు ఎల్లయ్య పాల్గొన్నారు.

# రాబోయేది కేసీఆర్ ప్రభుత్వమే

**కొత్తగూడెం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నేతల సమావేశం**




**కొత్తగూడెం టౌన్, యువ వెలుగు, అక్టోబర్ 07 :** కొత్తగూడెం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పార్టీ నాయకులు రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు, నిరుద్యోగుల సమస్యలు, పట్టభద్రుల ఓటరు నమోదు తదితర అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ చూసినా కేసీఆర్ పేరు వినిపిస్తోందని, రాబోయేది మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. "రాసి పెట్టుకోండి.. వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే" అని అన్నారు. బీఆర్ఎస్ నేత తక్కెళ్లపల్లి రవీందర్ మాట్లాడుతూ భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయానికి సంబంధించిన లెక్కలను తేల్చాల్సిన అవసరం ఉందన్నారు. ఆలయానికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. నవంబర్ 6వ తేదీ వరకు పట్టభద్రులు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్సీ రాకేష్ రెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగులు ఈసారి మోసపోవద్దని, ఉద్యోగాలు, ఉపాధి విషయంలో ప్రభుత్వం ఇచ్చే హామీలను నిశితంగా పరిశీలించాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రివర్యులు వనమా వెంకటేశ్వరరావు మాజీ శాసనసభ్యులు మెచ్చ నాగేశ్వరరావు బానోత్ హరిప్రియ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం - జిల్లా కలెక్టర్



**మిర్యాలగూడ, యువ వెలుగు, అక్టోబర్ 07 :** రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, ఇందులో భాగంగానే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నట్లు కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు.ఈ పాఠశాలల్లో 2,500 మంది విద్యార్థులకు ఒకే ప్రాంగణంలో నాణ్యమైన విద్య అందించేలా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. మిర్యాలగూడ నియోజకవర్గానికి మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికై మంగళవారం ఆయన మిర్యాలగూడ మండలం, జప్తి వీరప్పగూడెం గ్రామంలోని సర్వే నంబర్ 214లో సుమారు 20 నుంచి 25 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. పాఠశాల నిర్మాణానికి అనువుగా ఉన్న స్థల వివరాలు, సంబంధించిన లే అవుట్లు, భూ రికార్డుల వివరాలన్నింటినీ సమర్పించాలని రెవిన్యూ అధికారులను ఆదేశించారు.స్థలానికి సంబంధించిన రికార్డులను పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.కాగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలో 2500 మంది విద్యార్థులకు సరిపోయే విధంగా తరగతి గదులు, డార్మెటరీలు, కిచెన్, డైనింగ్, ల్యాబ్లు, లైబ్రరీ, ఆట స్థలాలు, ఇలా అన్ని సౌకర్యాలను కల్పించి కార్పొరేట్ తరహాలో వీటిని తీర్చిదిద్దనున్నారు.మైనింగ్ ఏడి రవికుమార్ ,ఆర్ ఐ రామకృష్ణ,ఆర్ ఐ కృష్ణయ్య, డిప్యూటీ సర్వేయర్ శ్రీనివాస్ రెడ్డి, సర్వేయర్లు శ్రీనివాస్, సైదులు, నరసింహ , కలెక్టర్ వెంట ఉన్నారు.



## ఫారం ఫండ్ పనులను పరిశీలించిన మండల అధికారులు



**సోనాల, యువ వెలుగు, అక్టోబర్ 07 :** అదిలాబాద్ జిల్లా సోనాల మండలంలోని దేవుల్ నాయక్ తండా గ్రామం సోనాల ఎంపీడీవో రత్నాకర్ రావు ఫారం ఫండ్ పనులను పరిశీలించి పలు సూచన చేశారు.ఫారం ఫండ్ వ్యవసాయ భూములలో నీటి నిల్వ కోసం ఏర్పాటు చేసుకోవాలని, దీని ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని, వి బి జి రాం జీ జాతీయ ఉపాధి హామీ లో భాగంగా ఫారం నిర్మించుకోవాలని, వ్యవసాయ క్షేత్రాల్లో వ్యవసాయ అభివృద్ధిలో భాగంగా నీటి ప్రవాహాన్ని నియంత్రించ డానికి భూగర్భ జలాలు పెంచడానికి ఫారం ఫండ్లు ఉపయోగపడ తాయన్నారు. ఏపీఓ శ్యామ్, సర్పంచ్ బాబూలాల్, సిబ్బంది పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న తోటి మిత్రుడికి ఆపన్న హస్తం



**మునుగోడు, యువ వెలుగు, అక్టోబర్ 07 :** మునుగోడు మండలంలోని ఇప్పర్తి గ్రామానికి చెందిన ఇరిగి ఆంజనేయులు, ఇటీవల గొంతులో కండ పెరగడంతో అనారోగ్యానికి గురయ్యారు. వైద్యులు పరీక్షించి ఇప్పటికే ఒకసారి చికిత్స అందించగా, ప్రస్తుతం మళ్లీ గొంతులో కండ పెరగడంతో మరోసారి ఆపరేషన్ చేయాల్సి ఉందని సూచించారు. ఆంజనేయులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను తెలుసుకున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పలివెలలో 2003-04 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న మిత్రులు స్పందించారు. తమ మిత్రుడికి వచ్చిన కష్టాన్ని తమ కష్టంగా భావించి, అందరూ కలిసి 24,000 ఇరవై నాలుగు వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు.

ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ, ఆంజనేయులుకు ప్రస్తుతం మరో ఆపరేషన్ అవసరం ఉన్నందున, తమతో కలిసి చదువుకున్న మిత్రులతో పాటు దయామయులైన ప్రతి ఒక్కరూ తమకు తోచినంత ఆర్థిక సహాయం చేసి అండగా నిలవాలని కోరారు."మిత్రుడికి కష్టం వచ్చినప్పుడు అండగా నిలవడం మా బాధ్యత. ఆంజనేయులు త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని కోరుకుంటున్నాం" అని వారు తెలిపారు. ఆర్థిక సహాయం అందించిన కార్యక్రమంలో బోయ లింగస్వామి, పంతంగి లింగస్వామి, ఈరటి శంకర్, కొరుపోలు అశోక్ తదితర మిత్రులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ



**యాదాద్రి(బీబీనగర్), యువ వెలుగు, అక్టోబర్ 07 :** ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరం లాంటిదని రాఘవపురం గ్రామ సర్పంచ్ సిద్ధగోని శ్రీకాంత్ గౌడ్ అన్నారు. బుధవారం బీబీనగర్ మండల పరిధిలోని రాఘవపురం గ్రామానికి చెందిన అంబటి సుష్మిత కు భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో మంజూరైన రూ 60 వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును లబ్ధిదారునికి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు న్యాలపట్ల అజయ్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు మేకల కుమారస్వామి, మాజీ సర్పంచ్ రక్తని కృష్ణ, మాజీ ఉపసర్పంచ్ అంబటి చంద్రయ్య, న్యాలపట్ల పాండు, రక్తని మల్లేష్, అంబటి జంగయ్య, కోర్ని పాండు, బొల్లోజు నరేంద్ర చారి, మేకల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ చేసిన గ్రామ సర్పంచ్

**లక్ష్మణ చందా, యువ వెలుగు, అక్టోబర్ 07 :** నిర్మల్ జిల్లా లక్ష్మణ చందా మండలంలోని నర్సాపూర్ (డబ్ల్యు ) గ్రామంలో అర్హులైన నిరుపేదల సొంత ఇంటి కల నెరవేరింది. గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు అయినా ప్రొసీడింగ్ పత్రాలను అధికారికంగా గ్రామ సర్పంచ్ మల్లేష్ యాదవ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపేదల జీవితంలో వెలుగు నింపుతుందని అన్నారు. గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా, పేదల సొంతింటి కల నెరవేరేలా ఇంద్రమ్మ ఇల్లే కాకుండా ప్రతి సంక్షేమ పథకం అందరికీ అందేలా కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నరేంద్ర, ఉప సర్పంచ్ శాతం రోజా నరేష్, గ్రామ ప్రజాప్రతినిధులు, కారోబర్ నర్సయ్య, గ్రామ వార్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జిన్నారంలో ముదిరాజుల గర్జన!

### బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలంటూ 500 మందితో భారీ ర్యాలీ

### తహసీల్దార్ కార్యాలయానికి వినతి పత్రం.. స్పందించకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం



**జిన్నారం, యువ వెలుగు, అక్టోబర్ 07 :** బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలనే డిమాండ్‌తో జిన్నారంలో ముదిరాజులు గర్జించారు. తమ హక్కుల సాధన కోసం మండలంలోని సుమారు 500 మంది ముదిరాజులు ఒక్కటై భారీ ర్యాలీ చేపట్టారు. ముదిరాజ్ సంఘ భవనం నుంచి ప్రారంభమైన ర్యాలీ తహసీల్దార్ కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేసి తమ డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.ర్యాలీలో ముదిరాజులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో జిన్నారం ప్రధాన వీధులు నినాదాలతో మార్మోగాయి. ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చి విద్య, ఉద్యోగ రంగాల్లో తగిన రిజర్వేషన్ ప్రయోజనాలు కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమానికి బీసీ-ఏ సాధన పోరాట రాష్ట్ర జేఏసీ చైర్మన్ గుళ్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 50 ఏళ్లుగా ముదిరాజులు వెనుకబాటుతనం, పేదరికంతో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముదిరాజుల పరిస్థితిని గుర్తించిన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 2009లో వారిని బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చేలా జీవో నంబర్ 15ను తీసుకొచ్చారని తెలిపారు.అయితే జీవో నంబర్ 15ను రద్దు చేయాలని సుప్రీంకోర్టులో కేసు నమోదైందని శ్రీనివాస్ ముదిరాజ్ పేర్కొన్నారు. 2022లో బీసీ కమిషన్ ద్వారా ముదిరాజులకు న్యాయం చేసేలా తీర్పు వచ్చినప్పటికీ ప్రభుత్వాలు ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం అన్యాయమని ఆరోపించారు.బీసీ-డీలో కొనసాగడం వల్ల ముదిరాజు విద్యార్థులు విద్యా రంగంలో రిజర్వేషన్ అవకాశాలను కోల్పోతున్నారని ఆయన అన్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి బీసీ కమిషన్ హియరింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవడంతో పాటు ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని డిమాండ్ చేశారు.తమ డిమాండ్‌పై ప్రభుత్వం స్పందించకపోతే జిన్నారంలో మొదలైన ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని శ్రీనివాస్ ముదిరాజ్ హెచ్చరించారు. ముదిరాజులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు నారబోయిన శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షుడు మున్ని నర్సింలు, నీలం సత్యనారాయణ, కౌన్సిలర్ జలగారు మల్లేశం, మాజీ వైస్ఎంపీపీ గంగు రమేష్, నాయకులు మద్దూరి పెంటేష్, బాలు గారి శ్రీనివాస్, మహేష్, సత్యనారాయణ, పుట్టి భాస్కర్, గాండ్ల శ్రీనివాస్ , వివిధ గ్రామాల ముదిరాజులు,తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పౌష్టికాహారం మంచిదే..

### మరి మా పరిస్థితి ఏంటి కార్మికుల ఆవేదన

### నాలుగు నెలలుగా నిధులు రాక అవస్థలు

**సోనాల, యువ వెలుగు, అక్టోబర్ 07 :** అదిలాబాద్ జిల్లాలో దాదాపు 1400 పైగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. సోనాల మండలంతో పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలలో మిడ్ డే మీల్స్ కార్మికులకు నిర్వహణ ఖర్చులు రాక నాలుగు నెలలుగా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం విద్యార్థుల హాజరు శాతం పెంచడానికి రోజువారి మధ్యాహ్నం భోజనం పథకంలో భాగంగా వారానికి మూడు గుడ్లు , అరటి పండ్లు, రాగి జావా, కూరగాయలు మంచి భోజనం ఇవ్వాల్సి వస్తుంది. వీటి నిర్వహణ పూర్తిగా మధ్యాహ్నం భోజన కార్మికుల పైనే ఉంటుంది. కాబట్టి కార్మికుల వారి వ్యక్తిగత నిధులు ఖర్చు చేసి ప్రభుత్వం ఇచ్చినప్పుడు తీసుకోవాలి. అయితే ప్రభుత్వం గత నాలుగు నెలలుగా నిధులు విడుదల చేయకపోవడంతో అవస్థలు పడుతున్నారు కార్మికులు. కూరగాయలు, పప్పు పప్పుతో సహా కిరాణా సరుకులు తెచ్చి వంట చేసి సమయానికి విద్యార్థులకు అందించాలి . కానీ



ప్రభుత్వం మాత్రం కార్మికులు ఇవ్వాల్సిన నిధులు మాత్రం విడుదల చేయకపోవడం చాలా బాధాకరమని కార్మికులు వాపోతున్నారు. ప్రతి విద్యార్థిని రోజు దాదాపు ప్రభుత్వం ఆరు నుంచి ఏడు రూపాయలు కేటాయిస్తుంది. అంటే ఒక ప్రభుత్వ పాఠశాలలో 500 మంది విద్యార్థులు ఉంటే వారి నెలవారి ఖర్చు దాదాపు 1 లక్ష రూపాయలు వరకు అవుతుందని కార్మికులంటున్నారు. ఇలా నెలకు లక్ష రూపాయలు కార్మికులు ఖర్చు పెడితే నాలుగు నెలలకు నాలుగు లక్షల రూపాయలు ప్రభుత్వం ఇవ్వకపోతే మేమెలా మధ్యాహ్న భోజన పథకం నిర్వహించాలని కార్మికులు ఆవేదన వ్యక్తం పరుస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనంతో పాటు, నెలవారి నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు.

## కార్తీక మాసంలో శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో అభిషేకాలు రద్దు

**రంగారెడ్డి, యువ వెలుగు, అక్టోబర్ 07 :** కార్తీక మాసాన్ని పురస్కరించుకుని భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం, రామేశ్వరం ఈవో శివకుమార్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం రామేశ్వరంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని కార్తీక మాసంలో వచ్చే సోమవారాలు, పౌర్ణమి రోజుల్లో స్వామివారికి నిర్వహించే అభిషేకాలను రద్దు చేసి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్వామివారి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు వారు వెల్లడించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకునే అవకాశం ఉన్నందున దర్శన ఏర్పాట్లకు భక్తులు సహకరించాలని దేవస్థానం నిర్వాహకులు కోరారు. దర్శన సమయం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందని తెలిపారు. కార్తీక మాసంలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున దేవస్థానం సూచనలను పాటిస్తూ స్వామివారి దర్శనం చేసుకోవాలని కోరారు.

## 61 మంది ఈపీ ఆపరేటర్లకు ప్లే డే మస్టర్ భత్యం చెల్లించాలి

### జేవీఆర్ ఓసీ యాజమాన్యానికి జేఏసీ వినతి

**సత్తుపల్లి, యువ వెలుగు, అక్టోబర్ 07 :** సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో 2026 ఫిబ్రవరి 1వ తేదీకి సంబంధించి నాలుగు మస్టర్లు లేకపోవడంతో, మూడు మస్టర్లలో విధులు నిర్వ హిస్తున్న 61 మంది ఈపీ ఆప రేటర్లకు యాజమాన్యం ప్రత్యేక అనుమతితో ప్లే డే నిర్వహించింది. అయితే ప్లే డే నిర్వహించి ఎనిమిది నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు సంబంధిత కార్మికులకు ఆ రోజు ప్లే డే మస్టర్ భత్యం చెల్లించకపోవడంపై కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ఇప్పటికే పలుమార్లు గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల స్ట్రక్చర్ సమావేశాల్లో చర్చించినట్లు తెలిపారు. అలాగే డైరెక్టర్లకు సైతం వినతిపత్రాలు అందజేసినప్పటికీ ఇప్పటివరకు ప్లే డే మస్టర్ భత్యం చెల్లించకపోవడంపై గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సత్తుపల్లి జేవీఆర్ ఓసీ కార్మికులు, వివిధ కార్మిక



సంఘాల నాయకులు కలిసి లిలిజాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ)గా ఏర్పడి యాజమాన్యానికి వినతిపత్రం సమర్పించారు. యాజమాన్యం ప్రత్యేక అనుమతితో ప్లే డే విధులు నిర్వహించేందుకు అనుమతించిన 61 మంది ఈపీ ఆపరేటర్లకు సంబంధించిన ప్లే డే మస్టర్‌ను వెంటనే నమోదు చేసి, పెండింగ్‌లో ఉన్న మస్టర్ భత్యాన్ని తక్షణమే చెల్లించాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు.

ఎనిమిది నెలలుగా ప్లే డే మస్టర్ భత్యం చెల్లించకపోవడం వల్ల సంబంధిత కార్మికులకు ఆర్థిక నష్టం జరుగుతోందని, యాజమాన్యం ఈ సమస్యను ఇకపై ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్మికుల హక్కుగా రావాల్సిన భత్యాన్ని తక్షణమే చెల్లించి సమస్యకు ముగింపు పలకాలని జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాన్ని గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ సముద్రాల సుధాకర్ ఆధ్వర్యంలో, గుర్తింపు సంఘం ఫిట్ సెక్రటరీ నరసింహారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాతినిధ్య సంఘ నాయకులు ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు, టీబీజీకేయస్ నాయకులు రఘువీర్, హెచ్ఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, ప్రాతినిధ్య సంఘ ఫిట్ సెక్రటరీ సీతారామరాజు, మురళీకృష్ణ, సుధాకర్, అస్గర్ ఖాన్, నరేందర్, పీవీ రాజు, సందీప్, ఇక్బాల్ తదితర వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# వాహనదారుల అప్రమత్తతే .. రోడ్డు ప్రమాదాల నివారణకు ఆయుధం - జిల్లా ఎస్పీ శరత్ చంద్ర

### అరైవ్-అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం

**చిట్యాల, యువ వెలుగు, అక్టోబర్ 07 :** వాహనదారుల అప్రమత్తతే రోడ్డు ప్రమాదాల నివారణకు సరైన ఆయుధమని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపిఎస్ అన్నారు.అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా నల్గొండ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో, సర్వేజన ఫౌండేషన్ సహకారంతో చిట్యాల మండలం వెలిమినేడు వద్ద ఎన్‌హెచ్--65 జాతీయ రహదారిపై ప్రయాణించే భారీ వాహనాలు, ట్రక్కుల డ్రైవర్ల కోసం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి, కంటి చూపు లోపాలు ఉన్న వారికి వైద్యుల సూచనల మేరకు ఉచితంగా కంటి అద్దాలను అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు భద్రతలో డ్రైవర్ల ఆరోగ్యం, ముఖ్యంగా కంటి చూపు అత్యంత కీలకమని అన్నారు. భారీ వాహనాల డ్రైవర్లు ఎక్కువ దూరం, ఎక్కువ సమయం ప్రయాణించాల్సి ఉండటంతో కంటి అలసట,చూపు మందగించడం, నిద్రలేమి, శారీరక అలసట వంటి కారణాలు ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందన్నారు. అందువల్ల డ్రైవర్లు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ,కంటి చూపును క్రమం తప్పకుండా పరీక్షించుకోవాల ని సూచించారు.రోడ్డు ప్రమాదాలను నివారించడంలో డిఫెన్సివ్ డ్రైవింగ్ ఎంతో ముఖ్యమని ఎస్పీ తెలిపారు.రోడ్డుపై ఇతర వాహనదారులు తప్పులు చేసే అవకాశం ఉందనే విషయాన్ని ముందుగానే ఊహించి, ప్రమాదకర పరిస్థితులను ముందుగానే గుర్తించి తగిన విధంగా వాహనం వేగాన్ని తగ్గించడం, సురక్షిత దూరం




పాటించడం, అవసరమైన సమయంలో బ్రేకులు వేయడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డ్రైవర్ తన వాహనాన్ని మాత్రమే కాకుండా చుట్టుపక్కల ఉన్న వాహనాలు, పాదచారులు, రోడ్డు పరిస్థితులు,మలుపులు, రహదారి పక్కన ఉన్న ప్రమాదకర ప్రాంతాలను నిరంతరం గమనిస్తూ అప్రమత్తంగా డ్రైవింగ్ చేయాలని అన్నారు. డ్రైవర్లు అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, మద్యం సేవించి వాహనం నడపడం,నిద్రమత్తులో డ్రైవింగ్ చేయడం, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ ఉపయోగించడం వంటి ప్రమాదకర చర్యలకు పూర్తిగా దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో హైవేలపై భారీ వాహనాలు నడిపే డ్రైవర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఎక్కువగా అలసట అనిపించినప్పుడు వాహనాన్ని సురక్షిత ప్రదేశంలో నిలిపి విశ్రాంతి తీసుకున్న తర్వాతే ప్రయాణాన్ని కొనసాగించాలని తెలిపారు.జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎస్పీ తెలిపారు. గత సంవత్సరం రోడ్డు ప్రమాదాల్లో సుమారు 350 మంది ప్రాణాలు కోల్పోయారని, వారిలో హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపిన కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య గణనీయంగా ఉందన్నారు. ఈ సంవత్సరం ఇప్పటివరకు హెల్మెట్ ధరించకపోవడం కారణంగా 32 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనంలో ప్రయాణించే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలను పాటించాలని ఎస్పీ సూచించారు. హెల్మెట్ కేవలం ట్రాఫిక్ నిబంధన కోసం కాకుండా ప్రమాద సమయంలో ప్రాణాలను కాపాడే రక్షణ కవచమని అన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణలో వాహనదారుల బాధ్యతతో పాటు రహదారిపై ప్రయాణించే ప్రతి ఒక్కరి అప్రమత్తత అవసరమని ఎస్పీ పేర్కొన్నారు.

ఎన్‌హెచ్-65 వంటి జాతీయ రహదారులపై నిరంతరం ప్రయాణించే భారీ వాహనాల డ్రైవర్ల కోసం నిర్వహిస్తున్న ఇలాంటి కంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఎస్పీ తెలిపారు. డ్రైవర్ల కంటి చూపు, ఆరోగ్యం సరిగా ఉండటం రోడ్డు భద్రతకు ఎంతో అవసరమని, ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న సర్వేజన ఫౌండేషన్ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ కే.శివరాం రెడ్డి, ఎస్బీ సీఐ నాగరాజు, ఎస్ఐలు వెంకట్ రెడ్డి, విష్ణు,డీటీఆర్బీ రిటైర్డ్ సీఐ అంజయ్య, స్థానిక సర్పంచ్ బొంతల చంద్రా రెడ్డి,సర్వేజన ఫౌండేషన్ ప్రతినిధి ప్రవీణ్ కుమార్,డాక్టర్ ప్రదీప్,వెలిమినేడు పీఏ సి ఎస్ చైర్మన్ ఏనుగు రఘుమా రెడ్డి,ఉపసర్పంచ్ అంతటి స్వప్న సత్తయ్య గౌడ్,పోలీస్ సిబ్బంది,వైద్య సిబ్బంది, లారీ అసోసియేషన్ సభ్యులు,భారీ వాహనాల డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.



Editor P. Mahesh Goud, Rachakonda printer's & publication's, Sri balaji printing press, H.No:-5-2-396, Venkateshwara colony, saheb nagar, Rangareddy, 500070
PRGI: TGTEL /26/A6429 office address : #5-4-183, Twin city towers complex, Abids, Hyd-500001, TG. yuvavelugu@gmail.com. Contact number : 9908 502 602